ఏలూరు నగరాభివృద్ధే లక్ష్యం

- రూ.4.57 కోట్ల పనులకు శంకుస్థాపనలు
- ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ అభ్యర్థి సునీల్ కుమార్



ఏలూరు 21వ డివిజన్‌లో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాని, ఎంపీ అభ్యర్థి సునీల్ కుమార్, మేయర్ నూర్జహాన్, ఇడా చైర్మన్ బొద్దాని



3వ డివిజన్‌లో శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాని, ఎంపీ అభ్యర్థి సునీల్ కుమార్, మేయర్ నూర్జహాన్, ఇడా చైర్మన్ బొద్దాని

ఏలూరు టౌన్: ఏలూర నగర సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తున్నామని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలోని ఐదు డివిజన్లలో ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌తో కలిసి ఆయన పర్యటించారు. 1, 2, 3, 4, 21 డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. తొలుత 3వ డివిజన్‌లోని దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఈ నాలుగేళ్ల ఎనిమిది నెలల కాలంలో సుమారు రూ.500 కోట్లకుపైగా అభివృద్ధి పనులు చేపట్టామని, వాటిలో కొన్ని పూర్తికాగా, మరికొన్ని త్వరలో ప్రారంభం కానున్నాయని చెప్పారు. శనివారం రూ.4.57 కోట్ల నిధులతో 47 రోడ్లు, 37 డ్రెయినేజీలు, నాలుగు కల్వర్టులు, ఒక పార్కు, 3 పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఏలూరు నగరాన్ని పూర్తి స్థాయిలో ఆధునీకరించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కృషి చేస్తున్నామని చెప్పారు.

శంకుస్థాపనలు ఇలా..

1వ డివిజన్‌లో రూ.94 లక్షలతో చేపట్టే 11 సీసీ రోడ్లు, నాలుగు సీసీ డ్రెయిన్లు, రెండు పైపులైన్లు, 2వ డివిజన్‌లో రూ.1.03 కోట్ల నిధులతో 11 సీసీ రోడ్లు, ఎనిమిది సీసీ డ్రెయిన్లు, ఒక పైపులైన్, 3వ డివిజన్‌లో రూ.90 లక్షలతో 11 సీసీ రోడ్లు, 11 డ్రెయిన్లు, నాలుగు కల్వర్టు నిర్మాణం, ఒకపార్కు ఆధునీకీకరణ, 4వ డివిజన్‌లో రూ.60 లక్షలతో 13 సీసీ రోడ్లు, 14 సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 21వ డివిజన్‌లో సెయింట్ ఆన్స్ కళాశాల సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ వరకు రూ.1.10 కోట్లతో రహదారి మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, ఏలూరు స్మార్ట్ సిటీ మాజీ చైర్‌పర్సన్ బొద్దాని అఖిల, కార్పొరేటర్లు ఆరేపల్లి రాధిక, జున్నూరు కనక నరసింహారావు, వీర్నపు డింపుల్ జాబ్, అన్నపనేని భారతి, కలవకొల్లు సాంబ, శ్రీ భారతి విద్యాసంస్థల అధినేత అన్నవనేని రవికుమార్, కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

నేటి నుంచి గొలుసుల పంజా ఉరుసు ఉత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక శనగపప్పు బజారు వద్ద ఉన్న హజరత్ మౌలా అలి మహాత్ముని దర్గా (గొలుసుల పంజా) ఉరుసు ఉత్సవాలు కులమతాలు, రాజకీయాలకు అతీతంగా నిర్వహించనున్నట్టు దర్గా వంశపారంపర్య ముజావరులు ఎండీ వజీర్ అలి, ఎండీ గాలబ్ అలి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి ఆయతే కరీమా, 11 గంటలకు దివ్య ఖుర్‌ఆన్ గ్రంథపారాయణ, ఏలూరు అహలే సున్నత్‌వల్ జమాత్ అధ్యక్షుడు షేక్ సాబీర్ హుస్సేన్ హజరత్ మౌలా అలి మహాత్ముని జెండా ఆవిష్కరిస్తారని ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి పిచ్చుకగుంట హజరత్ యాఖుబ్ ఖాన్ బాబా దర్గా వద్ద షేక్ జానీ నివాసం నుంచి సంథల్ షరీఫ్ (గంధం) ఊరేగింపు, రాత్రి గొలుసుల పంజా వద్ద దరూద్ సలాం ఫాతెహా ఖానీ నిర్వహిస్తామని తెలిపారు. 30వ తేదీన మచిలీపట్నానికి చెందిన ఎహెసాన్ రజా, ఏలూరు ఉల్మాక్రమ్ పేష్ ఇమామ్‌లు హజరత్ మౌలా అలి మహాత్ముని జీవిత చరిత్ర వివరిస్తారని, రాత్రి 7 గంటలకు దావత్ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఆళ్ల నాని, నగర మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు, నగరానికి చెందిన పలువురు కార్పొరేటర్లు పాల్గొంటారని తెలిపారు.

క్లుప్తంగా

ఐఏఎల్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, న్యాయవాదులు

ఏలూరు (టూటౌన్): ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ముద్రించిన 2024 డైరీని, టేబుల్ క్యాలెండర్‌ను స్థానిక ఆర్‌ఆర్ పేటలోని స్ఫూర్తి భవన్‌లో అసోసియేషన్ బాధ్యులు బండి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి ఐఏఎల్ నిరంతరం పోరాడుతోందని చెప్పారు. ఏలూరు జిల్లాలో ఐఏఎల్ నిర్మాణానికి న్యాయవాదులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఐఏఎల్ నాయకులు, సీనియర్ న్యాయవాదులు వాకాడ రాజారావు, పీపీ శాస్త్రి, పీఎస్ చందు, ఏలూరు బార్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి ఎ.సుబ్బారావు, న్యాయవాదులు ఎంవీఎస్ రామారావు, సబ్బి అజయ్, ఎంకే చైతన్య, ఏఏ రాజు, జీఎన్ రావు, బీఎస్ రావు, ఆర్ఎస్ డాంగే తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీలో ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. శనివారం స్థానిక అన్నే భవన్‌లో ఎం.జీవరత్నం అధ్యక్షతన ఏర్పాటుచేసిన సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. పేదల పట్ల కేంద్రం వివక్ష చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు వేతన బకాయిలను తక్షణం విడుదల చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.రవి, తామ ముత్యాలమ్మ, వై.నాగేంద్రరావు, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ మహంకాళీరావు, ఎం.సుధారాణి, టి.సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్, ఎస్ సాయి కృష్ణ, ఎస్ కోటేశ్వరరావు, హోలీ మేరి, వై.సీతాలక్ష్మయ్య, పి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

పెదపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. మండలంలోని సత్యవోలులో బేత దుర్గ ఫణీంద్ర అక్రమ మద్యం విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు పెదవేగి ఎస్సై కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విక్రయ కేంద్రంపై దాడి చేశారు. బేత దుర్గ ఫణీంద్ర తన ఇంటిలో ఉంచిన 8 క్వార్టర్ బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫణీంద్రపై పెదపాడు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కొత్త ఓటరు కార్డుల పంపిణీ

దెందులూరు: గ్రామంలో నూతనంగా మంజూరైన కొత్త ఓట్ల గుర్తింపు కార్డులను గోపన్నపాలెం గ్రామ సచివాలయంలో సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏనుగు రామాంజనేయులు, గ్రామ కార్యదర్శి స్టానీష్ బాబు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కొత్తగా ఓటు హక్కు పొందిన యువత తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీటీసీలు సువ్వా ప్రభుదాసు, ఏనుగు అంజలిప్రసాద్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నిత్యసహాయ మాత ప్రతిమతో గ్రామోత్సవం

దెందులూరు : పోతునూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ పరిసే డేవిడ్, ఆర్‌సీఎం సంఘస్తులు ఆధ్వర్యంలో శనివారం నిత్య సహాయ మాత గ్రామోత్సవం నిర్వహించారు. నిత్య సహాయ మాత ఉత్సవాల్లో భాగంగా మరియదళ సభ్యులు, ఉపదేశీయులు, ఉపాధ్యాయులు, సంఘస్తులు, సంఘపెద్దలు నిత్య సహాయ మాతను ప్రత్యేకంగా అలంకరించి అన్ని వీధుల్లో ఊరేగించారు. ఫాదర్ డేవిడ్ మాట్లాడుతూ పోతునూరులో నిత్య సహాయ మాత మహోత్సవాలు విజయవంతం చేసినందుకు విశ్వాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

అంజన్న సేవలో ఏపీఎస్పీ ఐజీ రామిరెడ్డి

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామిని శనివారం ఏపీఎస్పీ ఐజీ జీవీ రామిరెడ్డి, సీఐడీ డీఎస్పీ శివారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో వీరికి స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేయగా, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ స్వామి శేషవస్త్రాన్ని కప్పి సత్కరించారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత

ఎంపీపీ శ్రీనివాసరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరాజు



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

ఏలూరు రూరల్: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. శనివారం మధ్యాహ్నం ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామీణుల ఆర్థిక పరిస్థితి మెరుగు కావడంతో పాటు అర్బన్ స్థాయి మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఏలూరు రూరల్ మండలంలోని 15 గ్రామాల్లో సుమారు రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తవడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సహకారంతో ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ, ఓవర్‌హెడ్ ట్యాంకులు, కొత్త పైప్‌లైన్, తాగునీరు సరఫరా, సచివాలయం, వైఎస్సార్ క్లినిక్, ఆర్‌బీకే భవనాల నిర్మాణాలు 99 శాతం పూర్తి చేశామని తెలిపారు. ప్రజలు మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఎంపీడీఓ బి.ప్రణవి పరివేక్షణలో నిర్వహించిన ఈ సమావేశంలో జెడ్పీటీసీ మండల సరస్వతి, ఎంపీటీసీ సభ్యులు బోడిగడ్డ కుమారి, కాకర్ల తంబి, బలే స్వాతి, బలే సత్యప్రసాద్, సర్పంచ్‌లు వర్రి లక్ష్మీదుర్గ, వేజెళ్ల గోపాలకృష్ణంరాజు, ఎంఈఓ రంగయ్య, ఎంఏఓ జీవనసంధ్య తదితరులు హాజరయ్యారు.

రోడ్లకు రూ.1.40 కోట్లతో ప్రణాళిక

ఎంపీపీతో పాటు రాష్ట్ర వడ్డి కుల కార్పొరేషన్ డైరక్టర్ మండల కొండలరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్ జగనన్నకాలనీల్లో రోడ్లు అభివృద్ధిపై ప్రశ్నించగా, 11 జగనన్న కాలనీల్లో రోడ్ల అభివృద్ధికి రూ.1.40 కోట్లతో ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి నివేదించామని హౌసింగ్ ఏఈ లక్ష్మణ్ వివరణ ఇచ్చారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. జగనన్న కాలనీల్లో వేలాది స్థలాలకు సరిహద్దు రాళ్లు పాతామని తహసీల్దార్ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఉదయం కోమటిలంక జగనన్నకాలనీల్లో ఇళ్ల స్థలాలకు సరిహద్దు రాళ్లు పాతుతామన్నారు.

తాగునీరు విడుదల

రాబోయే వేసవిలో ప్రజలు తాగునీటి ఎద్దడిని అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని జాలిపూడి కోఆపరేటివ్ సొసైటీ త్రిసభ్య చైర్మన్ బొల్లిముంత రాము, కలకుర్రు సర్పంచ్ బలే నాగప్రసాద్ తదితరులు కోరారు. దీనిపై స్పందించిన ఇరిగేషన్ ఏఈ సుబ్రహ్మణ్యం మట్లాడుతూ కృష్ణ కెనాల్ నుంచి 300 క్యూసెక్కుల నీరు విడుదలైందన్నారు. కొద్దిరోజుల్లో ఈ నీరు ఏలూరు రూరల్ గ్రామాలకు చేరుకోవచ్చని తెలిపారు. దీనిపై స్పందించిన ప్రజాప్రతినిధులు గోదావరి, కృష్ణ నుంచి మరింత నీరు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ స్తంభాలను మార్చాలి

కోమటిలంక వద్ద చెరువుల మధ్య నుంచి వేసిన విద్యుత్ స్తంభాలను తొలిగించి, రోడ్డు గూండా వేయాలని కోమటిలంక సర్పంచ్ యోహాన్ ట్రాన్స్‌కో ఏఈ రాజ్‌కుమార్‌ను కోరారు. చాటపర్రు 1, 2 వార్డులో సీసీ రోడ్ల నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని సర్పంచ్ గుడిపూడి రఘు, మల్కాపురంలో కొత్తగా నాలుగు విద్యుత్ స్తంభాలు వేయాలని సర్పంచ్ పత్యాల సునీత కోరారు.

రహదారి భద్రత నియమాలు పాటించండి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి రామగోపాల్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో రామగోపాల్ అధ్యక్షతన శనివారం స్థానిక ఎన్ఆర్ పేటలోని నారాయణ మహిళా జూనియర్ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలు, భద్రత అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామగోపాల్ మాట్లాడుతూ ప్రజలు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రమాదాల్లో కుటుంబ యజమాని మరణిస్తే ఆ ప్రభావం కుటుంబం మొత్తం మీద పడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థీ విధిగా మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వస్తువులను నిషేధించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. అపరిచిత వ్యక్తులతో, సెల్ ఫోన్లను ఉపయోగించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ నేరం మోపబడిన ప్రతి వ్యక్తీ న్యాయ సహాయం పొందే అర్హత కలిగి ఉన్నారని, అందుకు చట్టం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ద్వారా ఈ సౌకర్యం కల్పిస్తుందని, కక్షిదారులు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అహిరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంచార జాతుల సమస్యలు పరిష్కరించాలి



గురువాచారికి అభినందులు చెబుతున్న రాజగోపాలాచారి

ఏలూరు (టూటౌన్): ఇప్పటికీ వివక్షతకు గురవుతోన్న సంచార జాతుల కులాల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు కుందుర్తి గురువాచారిని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు రాజగోపాలాచారి కోరారు. ఇటీవల బీసీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన గురువాచారిని శనివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. బీసీల సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. కొన్ని కులాలకు మాత్రమే బీసీ కోటాలో పదవులు లభిస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో విశ్వబ్రాహ్మణులకు కూడా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పదవులను కేటాయించాలని కోరారు. దీనిపై గురువాచారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కేటాయింపు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, సంచార జాతులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. తనకు బీసీ కమిషన్ సభ్యుడిగా పదవి ఇవ్వడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా కోదండరాముని కల్యాణ మహోత్సవం



స్వామి వారి ఊరేంగింపులో కోలాట ప్రదర్శన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని 25వ డివిజన్ పంజావీధి కోదండ రామాలయంలో శనివారం ఆలయ వార్షికోత్సవం సందర్భంగా కోదండ రాముని కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్పొరేటర్ గనువూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానికుల సహకారంతో ఆలయానికి రూ.3 లక్షల నిధులతో స్వామి, సీతమ్మ తదితర ఉత్సవ విగ్రహాలను సమకూర్చుకుని, అమ్మవారికి మంగళసూత్రాలు తయారుచేయించి ఈ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఉత్సవ విగ్రహాలను డివిజన్లోని పలు వీధుల్లో ఊరేగించారు. దారి పొడవునా కోదండరాముడిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపులో స్థానిక మహిళా బృందాలు ప్రదర్శించిన కోలాట కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు బెల్లాన్ని వెంకటేశ్వరరావు, పొట్నాని శ్రీనివాసరావు, తమ్మిరెడ్డి ఈశ్వరరావు, మరడాని రమేష్, బెల్లాన్ని సతీష్, మహిళలు పాల్గొని ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన అన్నసమారాధనలో భక్తులు స్వామి వారి ప్రసాదం స్వీకరించారు.

శ్రీ సత్యసాయి ఉచిత వైద్య కేంద్రం ప్రారంభం



సత్యసాయి ఉచిత వైద్య సేవాకేంద్రంలో వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ నరసింహన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భగవాన్ సత్యసాయిబాబా నూరవ జయంతోత్సవ సేవ కార్యక్రమాల్లో భాగంగా స్థానిక రామకృష్ణాపురంలోని సత్యసాయి సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన సత్యసాయి ఉచిత వైద్య సేవా కేంద్రాన్ని పుట్టపర్తి నుంచి విచ్చేసిన సత్య సాయి మొబైల్ హాస్పటల్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి నరసింహన్ శనివారం ప్రారంభించారు. సుమారు 200 మందికి వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య కేంద్రం వద్ద ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని సత్య సాయి సేవా సంస్థల ఏలూరు జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశి శేఖరరావు తెలిపారు. ఈ సందర్భంగా సత్య సాయి సేవా సంస్థలు, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల సమితి, భజన మండళ్ల సమావేశం నిర్వహించి, గ్రామాల్లో వైద్య సేవల నిర్వహణపై నరసింహన్ అవగాహన కల్పించారు. సత్య సాయి సేవా సంస్థల రాష్ట్ర మెడికల్ కోఆర్డినేటర్ పి.సాయికృష్ణ, రాష్ట్ర సేవాదళ్ కోఆర్డినేటర్ కె.శ్యామ్ ప్రసాద్, రాష్ట్ర మహిళా సేవాదళ్ కోఆర్డినేటర్ జి.శాంతి సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మికత తదితర అంశాలపై మాట్లాడారు. సత్యసాయి సేవా కేంద్రం గౌరవ అధ్యక్షుడు కొమ్మారెడ్డి భాస్కర రావు, ఏలూరు సమితి కన్వీనర్ పైడేటి రామారావు, సత్యసాయి సేవా సంస్థల ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సీహెచ్ సురేంద్ర, ఏలూరు పట్టణ వైద్య నిపుణుడు సీఎస్ ప్రసాద్, డాక్టర్లు రాయల చంద్రశేఖర్, వందన, కె.పృథ్వి నరేష్, బొప్పన దశరథ్, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు కె.రవీందర్ ప్రసాద్, సీహెచ్ పోతేపల్లి సత్య సాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చైర్మన్ చిలికాని సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా శిక్షణ, సందర్శన కార్యక్రమం

ఏలూరు(మెట్రో): విజయరాయి వ్యవసాయ పరిశోధనా స్థానం వెంటమాలజీ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ కె.మోహనరావు అధ్యక్షతన ఏలూరు వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో శనివారం జిల్లాకు సంబంధించి జనవరి నెల రైతు భరోసా శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని ఆరు సబ్ డివిజన్లకు చెందిన సహాయ వ్యవసాయ సంచాలకులు పంటల స్థితిగతులు, చీడపీడల పరిస్థితులు, వివిధ పంటల విస్తీర్ణాన్ని వివరించారు. జిల్లాలో వివిధ పంటల సాగును మోహనరావు తెలిపారు. ఏరువాకకేంద్రం కోఆర్డినేటర్ టి.సుజాత మామిడిలో పూత రావడానికి అత్రిల్ పిచికారీ చేయాలన్నారు. కీటక విభాగం ప్రధాన శాస్త్రవేత్త కె.ఫణి కుమార్ వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు క్లోరాంట్రనిప్రోల్ 0.3 మీ. టీ/లీ నీటికి కలిపి పిచికారీ చేయాలని, రసం పీల్చే పురుగుల నివారణకు గౌచ్ 5 ఎం.లీ./ఒక కేజీ విత్తనానికి చొప్పున కలిపి విత్తన శుద్ధి చేయాలని సూచించారు. వేరుశనగలో వచ్చే తెగుళ్ల పురుగుల గురించి వివరించారు. చింతలపూడి సబ్ డివిజన్‌లో వరికి బదులుగా ఆయిల్‌పామ్ వైపుకు రైతాంగం మొగ్గుచూపుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ చాముండేశ్వరి, ప్రధాన శాస్త్రవేత్త (జన్యు ప్రకారద శాస్త్రం), విజయరాయి, ఎన్ నాగేంద్ర శాస్త్రవేత్త (విస్తరణ) ఏరువాక కేంద్రం ఏలూరు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల ఆన్‌లైన్ సమస్య పరిష్కారానికి కృషి

దెందులూరు: ఇళ్ల స్థలాల మంజూరుకు ఆన్‌లైన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. శనివారం ఎంపీ కార్యాలయంలో జంగారెడ్డిగూడెం వైస్ ఎంపీపీ నర్రెడ్ల వెంకట సుబ్బారావుతో పాటు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఆడమిల్లి శేషయ్య, బర్రా సత్యనారాయణ, ఆడమిల్లి ఆనందరావు, కవులూరి కృష్ణారావు కలిసి ఆన్‌లైన్‌లో ఉన్న ఇబ్బందులను వివరించారు. వెంటనే ఎంపీ కోటగిరి శ్రీధర్ స్పందించి జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో ఫోన్‌లో మాట్లాడారు. సమస్య త్వరలో పరిష్కారమవుతుందని ఎంపీ అన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	24
వంకాయలు (కాంతులు)	20	బిళ్లచిక్కుడు	34
వంకాయలు (తెలుపు)	32	చామదుంపలు	60
బెండకాయలు	40	ములక్కాడలు	10-12
పచ్చిమిర్చి	34	కంద	60
కాకర కాయలు	48	బీట్‌రూట్	30
బీరకాయలు	44	కీర దోస	30
బీరకాయలు (పందిరి)	54	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	25-30	అల్లం	120
క్యారెట్	36-40	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	20	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	26	తోటకూర	10
గోరుచిక్కుడు	34	గోంగూర	08
దోసకాయలు	34	పుదీనా	05
ఆనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	02
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	11
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	03
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	18

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	02
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	02
ద్వారకాతిరుమల -ఏలూరు- బీహెచ్‌ఈఎల్	22.15	4822	01
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	32
ఏలూరు - తిరుపతి	16.00	4830	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.40	98517	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.10	98503	12